పనిచేయని నిఘా నేత్రాలు

- గ్రామాల్లో పెరిగిన చోరీలు
- సీసీ కెమెరాలను వినియోగంలోకి తేవాలంటున్న స్థానికులు

రఘునాథపల్లి: నేరాల నియంత్రణకు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు పనిచేయడం లేదు. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని బావించే వాటి నిర్వహణను ఎవరూ పట్టించుకోక పోవడంతో మండలంలో చోరీలు అధికమయ్యాయి. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా దొంగతనాలకు పాల్పడుతున్నారు. నాలుగేళ్ల క్రితం పోలీస్‌శాఖ ప్రోత్సాహం, దాతలు, ప్రజల భాగస్వామ్యంతో మండలంలోని 36 గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద దాదాపు 300కు పైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయా గ్రామాల సీసీ కెమెరాలు పోలీస్‌స్టేషన్‌కు అనుసందానంగా ఉండేది. మండలంలో ఎక్కడ ఏం జరిగినా, తెలిసిపోయేది, కెమెరాల వినియోగంతో నేరాల నియంత్రణతో పాటు, పలు కేసుల్లో పురోగతిని పోలీసులు సాధించారు. రఘునాథపల్లిలోనే 60 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా రహదారి విస్తరణలో పలు ప్రాంతాల్లోని కెమెరాలు తొలగించారు. తిరిగి కొన్ని చోట్ల అమర్చగా మరి కొన్ని చోట్ల ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. అక్కడక్కడ ఉన్న కెమెరాలూ సరిగా పనిచేయడం లేదు. అయినా పట్టించుకునే నాథుడు లేడు. ప్రధాన రహదారిపై ఉన్న కొన్ని కెమెరాలను ఇసుక అక్రమ రవాణా చేసే కొందరు పని చేయకుండా చేశారనే ఆరోపణలున్నాయి. పలు గ్రామాల్లో అక్రమ వ్యాపారాలు చేసే వారికి సీసీ కెమెరాలు అడ్డుగా ఉన్నాయని పని చేయకుండా చేశారనే విమర్శలు ఉన్నాయి. సీసీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించి మరమ్మతు చేయించాల్సి ఉండగా, ఎవరూ పట్టించుకోక అవి పాడయ్యాయి. కొన్ని గ్రామాల్లో ఇళ్లు, షాపులు, ఫాంహౌస్‌లలో ఏర్పాటు చేసిన కొన్ని సీసీ కెమెరాలు మాత్రం అక్కడక్కడ పని చేస్తున్నాయి. కెమెరాల భయంతో సాధారణంగా చోరీలు చేసేందుకు భయపడుతుంటారు. ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో దొంగలు రెచ్చిపోతున్నారు.


రామన్నగూడెంలో నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరా

నిందితుల గుర్తింపులో జాప్యం

సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో నేరాల నియంత్రణలో జాప్యం జరుగుతుంది. వాహనాల దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు, వ్యవసాయ బోర్ల కేబుల్స్ కట్ చేసుకుపోవడం, ఇళ్లల్లో చోరీలు, గొర్రెలు, పశువుల అపహరణ జరిగినప్పుడు అందుకు బాధ్యులను వెంటనే గుర్తించేందుకు పోలీసులు ఇబ్బందులు పడుతున్నారు. పలు కేసుల్లో పురోగతి కనిపించడం లేదు..

పెరుగుతున్న నేరాలు

గ్రామాల్లో సీసీ కెమారాలు పని చేయక పోవడంతో నేరాలు పెరుగుతున్నాయి. సీసీ కెమెరాలు ఉంటే చోరీలు, నేరాలను అరికట్టవచ్చని స్థానికులు అంటున్నారు. సీసీ కెమెరాల మరమ్మతుల భారాన్ని ఎవరు భరించాలో స్పష్టత లేక పోవడంతో వాటి నిర్వహణలో జాప్యం జరగుతోందని సమాచారం.

ఎవరూ పట్టించుకోవడం లేదు..



ప్రజల బాగస్వామ్యంతో గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయకుండా నిరుపయోగంగా ఉన్నాయి. అధికారులు దృష్టిసారించి సీసీ కెమెరాలు మరమ్మతు చేయించి ఉపయోగం లోకి తీసుకురావాలి. సీసీ కెమెరాలు పనిచేస్తే నేరాలు, దొంగతనాలు కూడా అదుపులో ఉంటాయి.

- ఎండీ యాకూబ్, మాజీ సర్పంచ్, రామన్నగూడెం

మరమ్మతులు చేయిస్తాం



చాలా గ్రామాల్లో సీసీ కెమెరాలు పని చేయడం లేదన్న విషయం మా దృష్టికి వచ్చింది. ముందుగా రఘునాథపల్లి మండల కేంద్రంలోని 50 సీసీ కెమెరాలు మరమ్మతు చేసేలా టెక్నీషియన్‌తో మాట్లాడాం. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం. సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రజలు కూడా భాగస్వాములు కావాలి.

- దూదిమెట్ల నరేశ్, ఎస్సై, రఘునాథపల్లి

వైభవంగా పోచమ్మ బోనాలు


మేకపోతుల బండితో ర్యాలీగా వస్తున్న యాదవులు


రఘునాథపల్లి: బోనాలతో వెళ్తున్న మహిళలు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ గ్రామంలో బుధవారం పోచమ్మ, పెద్దమ్మ, ముత్యాలమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్‌లు పెద్దమ్మతల్లి, పోచమ్మతల్లి బోనాలు చేయగా, గౌడ కులస్తులు ముత్యాలమ్మ బోనాలు, గ్రామంలోని ఇతర కులస్తులు పోచమ్మ బోనాలు నిర్వహించారు. కాగా యాదవ కులస్తులు మేకపోతుల బండితో డప్పు చప్పుళ్లతో వీధుల గుండా ర్యాలీ చేపట్టారు. అనంతరం ముత్యాలమ్మ గుడి వద్ద పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలతో గ్రామదేవతల ఆలయాల వద్దకు వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఫతేషాపూర్‌లో..

రఘునాథపల్లి: ఫతేషాపూర్‌లో గ్రామస్తులు పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్లతో మహిళలు బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ తల్లి దేవాలయానికి చేరుకుని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. పాడి పంటలు బాగా పండి పిల్లాపాపలు చల్లంగా ఉండాలని వేడుకున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

పాలకుర్తి: పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దరి చేరవని వైద్యాధికారులు సిద్దార్ధ్ రెడ్డి, డి.ఉషారాణి అన్నారు. మండలంలోని గూడూరులో ఎస్టీ గురుకుల బాలికల విద్యాలయంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 10 మంది విద్యార్థుల నుంచి రక్తనమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ రేణుక చౌహాన్, సిహెచ్ రమణమ్మ, పీహెచ్ఎన్ లిల్లీ డేబోరా, ఏఎన్ఎం శోభారాణి, హెచ్ఎస్‌సీ శోరోమణి ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

అటెన్షన్ ప్లీజ్



ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

మండలకేంద్రంలోని శివాలయం దారిలో రోడ్డు మధ్య విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. కూడలిలో రోడ్డు మధ్య ఉన్న విద్యుత్ స్తంభాన్ని వేరేచోటకు మార్చి ప్రమాదాలు చోటు చేసుకోకుండా.. రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- కొడకండ్ల

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
రాములు, ఏఈ, విద్యుత్‌శాఖ
ఫోన్‌నంబర్ : 9440814104

క్లుప్తంగా

పైపులైన్‌కు మరమ్మతు


సాక్షి ఎఫెక్ట్..

జనగామ: పట్టణంలోని 3వ వార్డు పరిధిలో 15 రోజులుగా లీకేజీ అవుతున్న మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు. ఈ నెల 28న సాక్షి దినపత్రికలో 'మిషన్ భగీరథ పైపు లైన్ లీకేజీ' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కాలనీవాసులు లీకేజీని వెలుగులోకి తీసుకువచ్చిన నాయకులు, సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



బచ్చన్నపేట: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎన్ఎం ప్రసన్న అన్నారు. మండలంలోని నారాయణపురంలో జ్వరాలతో బాధపడుతున్న వారి ఇళ్ల చుట్టూ దోమల మందును పిచికారీ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దోమల నివారణకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శి దేవీప్రసాద్, ఆశ వర్కర్ ఉపేంద్ర, కారోబార్ ప్రభాకర్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు

లింగాలఘణపురం: మండలంలోని నవాబుపేట కోదండ రామస్వామి ఆలయంలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయ ప్రకారం వైష్ణవాలయాల్లో కృష్ణాష్టమి మరునాడు వేడుకలను నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా ఈఓ ప్రసన్నకుమారి ఆధ్వర్యంలో అర్చకులు లక్ష్మీనర్సింహాచార్యులు, కృష్ణమూర్తి వేడుకలను నిర్వహించారు. గ్రామంలో ఊరేగించి ఉట్లు కొట్టారు. సీనియర్ అసిస్టెంట్ సీహెచ్ రాజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక డంప్‌లు సీజ్

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండలో ఎలాంటి అనుమతి లేకుండా నిల్వ చేసిన ఇసుక డంప్‌లను బుధవారం సీజ్ చేసినట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు నిడిగొండ శ్రీపరివార్ యోగ ఆశ్రమం, కురుమగూడెంలో నిల్వ చేసిన ఇసుక డంప్‌లను ఆర్ఐ శరత్‌చంద్రతో కలిసి గుర్తించారు. 10 ట్రాక్టర్ ట్రిప్‌లు గల రెండు ఇసుక డంప్‌లను సీజ్ చేశారు. ఇసుక అక్రమంగా తరలించి నిల్వచేసిన మాల్ల రాజును తహసీల్దార్ యుగేందర్ సమక్షంలో బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలించినా, నిల్వ చేసినా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

భరతనాట్యంలో విద్యార్థుల ప్రతిభ

పాలకుర్తి: భువనగిరి జిల్లాలోని స్వర్ణగిరి ఆలయంలో సోమవారం నిర్వహించిన భరతనాట్యం పోటీల్లో సిద్దార్థ విద్యాలయం విద్యార్థులు, పీఈటీ ఉత్తమ ప్రతిభ కనబరిచి అవార్డులు అందుకొన్నరని ప్రిన్సిపాల్ జక్కుల రవీందర్ తెలిపారు. ఈ మేరకు విద్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డు గ్రహీతలు పీఈటీ గుగ్గిళ్ల యాదలక్ష్మి, పెందోట శ్రేష్టలను ఉపాధ్యాయులు అభినందించారు. విద్యాలయం కరెస్పాండెంటు జక్కుల ఊర్మిళ, ఉపాధ్యాయులు దామోదర, విద్యార్థులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ వేడుకలు

లింగాలఘణపురం: మండల కేంద్రంలో బుధవారం వీహెచ్‌పీఎస్ 17వ ఆవిర్భావ వేడుకలను పురష్కరించుకుని వీహెచ్‌పీఎస్ జిల్లా కన్వీనర్ గద్దం సోమరాజు జెండాను ఆవిష్కరించారు. దివ్యాంగుల హక్కుల కోసం పోరాడి పెన్షన్లు సాధించిన మంద కృష్ణమాదిగ సేవలను అభినందించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్, ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి సందెన రవీందర్, జిల్లా కార్యదర్శి సురేశ్, విజయ్, యాకయ్య, రాములు, సోమయ్య, రాంచందర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

బచ్చన్నపేట: మండలంలోని కొడవటూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారుల సంఖ్యను పెంచాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి బృంగి రూపాచైతన్య అన్నారు. గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గుడ్లు, ఆహార పదార్థాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని అన్నారు.

సన్మానం

కొడకండ్ల: పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యను బుధవారం మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకులు సన్మానించారు. ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ అందె యాకయ్యతో కలిసి గడ్డం సమ్మయ్య పాఠశాలను సందర్శించగా సన్మానం చేశారు. అధ్యాపకులు మంజుల, వెంకన్న పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



జఫర్‌గఢ్: ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శంకరయ్యకు అందజేశారు. రాజు, సుధాకర్, శ్రీను, గంగరాజు, రవి, రామన్న, అజయ్ రాజు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



బచ్చన్నపేట: మండలంలోని వంగసుదర్శన్‌రెడ్డి నగర్ గ్రామంలో కాలియా శాంతమ్మ మృతి చెందింది. కాగా, బాధిత కుటుంబ సభ్యులను చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లనాగుల శ్వేతవెంకటాచారి పరామర్శించి రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు. వారి వెంట గౌడుగు కమలాకర్, రాములు, పుట్ట నర్సింహులు, చవాన్ నరేష్ ఉన్నారు. కాగా, పడమటికేశ్వాపూర్ గ్రామంలో మృతి చెందిన ఎర్రోళ్ల ఎల్లమ్మ కుటుంబ సభ్యులను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జంగిటి విద్యానాథ్ పరామర్శించి రూ. 5వేల సాయం అందజేశారు.

వివాహానికి..

మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన కర్రె వజ్రమ్మ, కొమురయ్య దంపతుల కూతురు హన్సిక వివాహానికి సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ రూ. 5వేలను అందజేశారు. బుధవారం పెళ్లికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మాజీ ఎంపీటీసీ అంబాల ఆగయ్య, పసుల సిద్దిరాములు, ఎంటె శ్రీనివాస్, ఉప్పల్‌రెడ్డి, కిష్టయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్యుత్‌ను ప్రైవేటీకరించొద్దు

పాలకుర్తి: కేంద్రప్రభుత్వం విద్యుత్‌ను ప్రైవేటీకరించొద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు అన్నారు. పాలకుర్తిలో చిట్యాల సోమన్న అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం విద్యుత్‌ను ప్రైవేట్ రంగాలకు అప్పగిస్తే అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని అన్నారు. జి.అమృతారెడ్డి,బి.రామ్మూర్తి, పి. వెంకట రమణ, ఎం. యాకన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఎన్నిక


బి.నర్సింహ

దేవరుప్పుల: పెద్దమడూరు కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా బోనగిరి నర్సింహ, రాపాక యాదగిరి ఎన్నికైనట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కమిటీలో మార్పు చేర్పులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ధర్మారెడ్డి, గణేశ్, సైదుల్‌రెడ్డి, రామచంద్రునాయక్, శ్రీను పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


నజీరుద్దీన్

చిల్పూరు: మండల వ్యవసాయాధికారిగా నజీరుద్దీన్ అహ్మద్ ఖాన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు ఎలాంటి సమస్యలున్నా నేరుగా తనను కలువొచ్చని అన్నారు.

బీజేపీ మండల కన్వీనర్‌గా అనిల్‌కుమార్

నర్మెట: బీజేపీ మండల కన్వీనర్‌గా మండలంలోని ఆగాపేట గ్రామానికి చెందిన సాక్కం అనిల్‌కుమార్‌ను నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి బుధవారం ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ తనకు ఈ పదవీ రావడానికి కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ అమరవీరులకు ఘన నివాళి

జనగామ రూరల్/స్టేషన్‌ఘన్‌పూర్/బచ్చన్నపేట/జఫర్‌గఢ్: బషీర్‌బాగ్‌లో పోలీసుల కాల్పుల్లో మృతిచెందిన విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభలను జిల్లా వ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ అమరుల చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ 2000 సంవత్సరంలో చంద్రబాబు ప్రభుత్వం ప్రజలపై అధిక విద్యుత్ ఛార్జీలు మోపి కరెంట్ కోతలతో తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందన్నారు. విద్యుత్ సమస్యలపై నాడు సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలు బషీర్‌బాగ్‌లో చేపట్టిన శాంతియుత నిరసన ర్యాలీపై పోలీసులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు మృత్యువాత పడగా వేలాది మంది గాయపడ్డారన్నారు. బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటాల మూలంగానే చంద్రబాబు ప్రభుత్వం గద్దె దిగిందని, అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం, దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఉచిత విద్యుత్ పథకాన్ని తీసుకువచ్చి రైతులకు అండగా నిలిచారన్నారు. నాటి పోరాటస్ఫూర్తితో ప్రజలు ముందుకెళ్లాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి, నాయకులు రాపర్తి సోమయ్య, బూడిద గోపి, భూక్య చందు, లింగం, లలిత, మునిగెల రమేష్, దైద రాములమ్మ, మంద మహేందర్, వంగపండ్ల సోమయ్య, బెల్లంకొండ వెంకటేష్, అశోక్, వెంకటప్ప, రాజవ్వ, బలరాములు, గుండెబోయిన రాజు, కాట సుధాకర్, సక్క యాకయ్య, అనిల్, మంగళంపల్లి జనార్ధన్, రాములు తదితరులు పాల్గొన్నారు.


జనగామ రూరల్: నివాళులర్పిస్తున్న మోకు కనకారెడ్డి తదితరులు

అర్హులందరికీ రుణమాఫీ వర్తిస్తుంది


తరిగొప్పుల: వివరాలు సేకరిస్తున్న ఏడీఏ బీనా


చిల్పూరు: దరఖాస్తులు తీసుకుంటున్న ఏఓ

తరిగొప్పుల: అర్హులందరికీ రూ.2 లక్షల పంట రుణం తప్పకుండా ప్రభుత్వం మాఫీ చేస్తుందని, రైతులు అసహనానికి గురికావద్దని మండల ప్రత్యేక అధికారి, జనగామ డివిజన్ ఏడీఏ బీనా అన్నారు. కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల పంట రుణం ఉండి, రేషన్ కార్డు లేని రైతుల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం సేకరించారు. రైతుల నుంచి ఏడీఏ దరఖాస్తులు స్వీకరించి రేషన్ కార్డు గ్రూపింగ్ చేసి వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రూ.2 లక్షల పంట రుణం ఉండి రేషన్ కార్డు లేని రైతులు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రూ.2 లక్షల పైగా రుణం ఉన్న రైతులు ఆపై మొత్తాన్ని చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ కమల తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

చిల్పూరు: అర్హులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని, రైతులు ఆందోళన చెందొద్దని ఏఓ నజీరుద్దీన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాలలో బుధవారం ఇంటింటి సర్వే నిర్వహించిన అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఏఈఓలు నరసింహులు, వినయ్‌కుమార్‌నాయక్, యాకూబ్, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.


లింగాలఘణపురం: బండ్లగూడెంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న ఏఓ వెంకటేశ్వర్లు, ఏఈఓలు

ఇంటింటి సర్వే

లింగాలఘణపురం: రుణమాఫీ పథకంలో పేరు ఉండి రేషన్ కార్డు లేనివారికి, కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం మండలంలోని బండ్లగూడెంలో ఇంటింటి సర్వే వ్యవసాయశాఖ అధికారులు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలంలో 368 మంది రైతుల వివరాలను ప్రభుత్వం ఆన్‌లైన్‌లో ఇవ్వడం జరిగిందని, వీరందరి ఇళ్లకు వ్యవసాయాధికారులు వెళ్లి కుటుంబ నిర్ధారణను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. అందుకు రైతులు కుటుంబ సభ్యుల ధ్రువీకరణ దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డులను అందజేయాలని కోరారు. ఏఈఓలు స్పందన, శ్రీనివాస్, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

జనగామ రూరల్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో పైస రాములు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు కావొస్తున్నా చేవెళ్ల సభలో ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌కు నోచుకోలేదన్నారు. ప్రభుత్వం అంబేడ్కర్ అభయహస్తం కోసం విధివిధానాలు రూపొందించాలన్నారు. దళితుల సమగ్రాభివృద్ధికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిని నియమించాలన్నారు. హాస్టళ్లలోని విద్యార్థులకు మెస్‌చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని కోరారు. సమావేశంలో మంగళంపల్లి జనార్దన్, సోమన్న, యాదగిరి, ఎల్లయ్య, సమ్మయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనిల్ కుమార్

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

రఘునాథపల్లి: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో గణేశ్ ఉత్సవ కమిటీలు, యువజన సంఘాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీజేలు పూర్తిగా నిషేధమని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని అన్నారు. ఉత్సవాలు విజయవంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన పేర్కొన్నారు. ఎస్సై డి.నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పండుగలు..

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రజలందరూ పండుగలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని స్థానిక సీఐ జి.వేణు అన్నారు. ఘన్‌పూర్ మండలానికి సంబంధించిన వివిధ మత పెద్దలతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఆధ్వర్యంలో బుధవారం పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారతదేశం అన్ని మతాలకు నిలయమని, ప్రతీ ఒక్కరూ మత సామరస్యం పాటిస్తూ అన్ని మతాలను గౌరవించాలన్నారు. రానున్న వినాయక చవితి వేడుకలను గణేశ్ ఉత్సవ కమిటీ వారు ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు అన్ని మతాల వారు పోలీసులతో సహకరించాలని ఆయన కోరారు. ఎండీ.రహ్మతుల్లా, షమీర్, దస్తగిరి, మాషుక్, పాస్టర్ బాలస్వామి, సింగపురం రాజయ్య, నాగయ్య, జీడి రమేష్, ఎం.కిషోర్‌కుమార్, సత్యనారాయణరెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.


రఘునాథపల్లి: నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి



స్టేషన్‌ఘన్‌పూర్: గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ వేణు

'గణేశ్ మండపాల'కు అనుమతి తప్పనిసరి

చిల్పూరు: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించే నిర్వాహకులు మండపాల ఏర్పాటుకు పోలీస్‌స్టేషన్ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండపాల ఏర్పాటుకు అనుమతి తీసుకున్న తర్వాతనే ఉత్సవాలు నిర్వహించాలన్నారు. మండపాల వద్ద డీజే సిస్టంకు అనుమతి లేదన్నారు. ప్రశాంతంగా గణేశ్ ఉత్సవాలు నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. ఏఎస్సై జయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

లింగాలఘణపురం: గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఎస్సై బండి శ్రావణ్‌కుమార్ మండల ప్రజలను కోరారు. పోలీసుస్టేషన్‌లో ఆయా గ్రామస్తుల ముఖ్యులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని తగిన సూచనలు చేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి

పాలకుర్తి: ప్రభుత్వ గురుకుల, అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. పాలకుర్తి మండలం గూడూరు ఎస్టీ బాలికల గురుకుల విద్యాలయాన్ని ఆయన సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం బమ్మెరలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వంటలను, ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గరపడుతున్నందున ఓటరు లిస్టుల్లో చేర్పులు మార్పులు త్వరగా చేయాలని సిబ్బందికి సూచించారు. ఆర్ఐ రాకేష్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో భోజనం చేస్తున్న తహసీల్దార్